# సాక్షి
## శ్రీసత్యసాయి జిల్లా

శనివారం । 18 । జనవరి । 2025






**చీనీ టన్ను రూ.28,320**

అనంతపురం మార్కెట్ యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.28,320, కనిష్టంగా రూ.12 వేలు, సరాసరిన రూ.18,220 ప్రకారం ధర పలికాయి.



**టమాట కిలో రూ.11**

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.11 కనిష్టంగా రూ.7, సరాసరిన రూ.9 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

**31.2°/13.8°**

జిల్లాలో శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

## న్యూస్‌రీల్

### నేడు నవోదయ ప్రవేశ పరీక్ష



లేపాక్షిలోని నవోదయ విద్యాలయం

**లేపాక్షి:** జవహర్ నవోదయ విద్యాలయలో 6వ తరగతిలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు శనివారం పరీక్ష నిర్వహించనున్నట్లు లేపాక్షి విద్యాలయ ప్రిన్సిపాల్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 7,987 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా, అందులో 4,556 మంది బాలురు, 3,431 మంది బాలికలు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా అనంతపురం జిల్లాలో 15, శ్రీసత్యసాయి జిల్లాలో 19 చొప్పున మొత్తం 34 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష ఉంటుందని, కేంద్రానికి గంట ముందే హాజరు కావాలని విద్యార్థులకు సూచించారు.

### ఎండుమిర్చి @ రూ.16 వేలు



మార్కెట్‌లో ఎండు మిర్చి క్రయ విక్రయాలు

**హిందూపురం అర్బన్:** ఎండుమిర్చి ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. శుక్రవారం హిందూపురం వ్యవసాయ మార్కెట్‌కు 104 క్వింటాళ్ల ఎండు మిర్చి వచ్చింది. ఈ–నామ్ పద్ధతిలో వేలం పాటలు నిర్వహించగా, మొదటి రకం ఎండుమిర్చి క్వింటా రూ.16 వేలు, రెండో రకం క్వింటా రూ.8 వేలు, మూడో రకం ఎండుమిర్చి క్వింటా రూ.7 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి చంద్రమౌళి తెలిపారు. మార్కెట్‌కు నాణ్యమైన సరకు తీసుకువచ్చి మంచి ధరలు పొందాలని రైతులకు ఆయన సూచించారు.

### ఖాద్రీశుడి హుండీ ఆదాయం రూ.82 లక్షలు



హుండీ కానుకలు లెక్కిస్తున్న దృశ్యం

**కదిరి టౌన్:** ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామికి భక్తులు హుండీ ద్వారా సమర్పించిన కానుకలను శుక్రవారం లెక్కించారు. 58 రోజులకు గానూ రూ.82,14,097 నగదు, 8 గ్రాముల బంగారం, 406 గ్రాముల వెండి వచ్చినట్లు ఆలయ ఈఓ వెండి దండి శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే 60 అమెరికా డాలర్లు, 10 కెనడా డాలర్లు హుండీ ద్వారా భక్తులు స్వామికి సమర్పించారన్నారు. గతంతో పోలిస్తే ఈసారి హుండీ ఆదాయం ఎక్కువగా వచ్చినట్లు ఈఓ వెల్లడించారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి ఎన్.ప్రసాద్, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చలపతి, బ్యాంక్, ఆలయ సిబ్బంది, వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

❒ గుంతకల్లుకు చెందిన లీలావతి కాన్పు కోసం అనంతపురం సర్వజనాస్పత్రికి వెళ్లింది. అక్కడ పరిస్థితి చూస్తే ఒకే మంచంపై ఇద్దరు ముగ్గురు పడుకుని ఉండటంతో ఓ ప్రైవేటు నర్సింగ్‌హోంకు వెళ్లింది. నార్మల్ డెలివరీ అయింది కానీ.. రూ.30 వేలు బిల్లు వేయడంతో ఆ కుటుంబం విస్తుపోయింది.

❒ అనంతపురం హౌసింగ్‌బోర్డుకు చెందిన రంగనాయకులు అనే 45 ఏళ్ల వ్యక్తి ఛాతిలో నొప్పి రావడంతో ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు వెళ్లారు. గుండె కవాటాలు మూసుకుపోయాయని, స్టంటు వేసి రూ.2.70 లక్షల బిల్లు వేయడంతో రంగనాయకులు హతాశులయ్యారు.

❒ ఈ రెండు సమస్యలే కాదు క్యాన్సర్, ప్రమాద బాధితుల వైద్య ఖర్చులు కూడా భారీగా ఉండడంతో జనం హడలెత్తిపోతున్నారు.



# వైద్యం.. భారం

- నాలుగింటితోనే భయం
- గుండె, క్యాన్సర్ వైద్యానికి భారీగా వ్యయం
- ప్రసవాలు, ప్రమాద చికిత్స ఖర్చులూ భారమే
- ప్రైవేట్‌లో ఆరోగ్యశ్రీ సేవలకు విముఖత

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** సామాన్యుల నుంచి సంపన్నుల వరకు ఆ నాలుగు రకాల జబ్బులకు భయపడిపోతున్నారు. వైద్యం ఖరీదుతో కూడుకుని ఉండటమే ఇందుకు కారణం. గుండె, క్యాన్సర్, కాన్పులు, ప్రమాద బాధితులకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందకపోతే ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. సంపన్నులు ఎలాగోలా వైద్యం చేయించుకుంటున్నారు. పేదల పరిస్థితి మాత్రం దారుణంగా ఉంది. రూ.5 లక్షల్లోపు వార్షిక ఆదాయం కలిగిన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యసేవలు అందేవి. గడిచిన ఐదేళ్లు ఉచిత వైద్యసేవలు సజావుగా అందాయి. ప్రస్తుతం ఆరోగ్యశ్రీ వైద్య సేవల్లో ఒడుదుడుకులు మొదలయ్యాయి. పలు ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్యమందించేందుకు నిరాకరిస్తున్నారు. ఇందుకు కారణం ప్రభుత్వం నుంచి బిల్లులు సకాలంలో రాకపోవడమేనని తెలుస్తోంది. విధిలేని పరిస్థితుల్లో అప్పోసప్పో చేసి ప్రైవేట్‌గా చికిత్స చేయించుకోవాల్సి వస్తోంది.

**గుండెజబ్బులతో దడ**

గుండె జబ్బులు సామాన్యులను భయపెడుతున్నాయి. ఏటా 20 వేల వరకు గుండెపోటు కేసులు ఉమ్మడి అనంతపురం జిల్లాలో నమోదవుతున్నాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు లేవంటున్నారంటే ఇక దారుణ పరిస్థితులే. ఒక స్టంట్ వేస్తే రూ.2 లక్షల వరకు అవుతోంది. దీంతో జనం బెంబేలెత్తుతున్నారు.

**ఉమ్మడి జిల్లాలో 2019 నుంచి 2023 వరకు ఆరోగ్యశ్రీ కింద చికిత్సలు..వ్యయం**

| కేటగిరీ | లబ్ధిదారులు | వ్యయం |
|---|---|---|
| గుండె జబ్బులు | 24,022 | రూ.101,63,90,918 |
| క్యాన్సర్ | 35,319 | రూ.72,31,89,174 |
| ప్రమాద గాయాలు | 34,224 | రూ.87,65,83,851 |
| నార్మల్ డెలివరీలు | 18,318 | రూ.13,85,55,520 |
| సిజేరియన్ డెలివరీలు | 17,992 | రూ.24,03,41,671 |

**క్యాన్సర్ కేసులతో ఆందోళన**

ఉమ్మడి జిల్లాలో క్యాన్సర్ కేసులు ఏటికేటికీ పెరుగుతున్నాయి. ముఖ్యంగా మహిళల్లో రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌లు ఎక్కువ. చాలామంది హైదరాబాద్‌కు వెళ్లి చికిత్స తీసుకుంటున్నారు. సర్జరీలు, కీమో థెరపీలకు ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

**ప్రమాద బాధితులకు భరోసా లేదు**

అనంతపురం జిల్లాలో ఎక్కువగా రోడ్డు ప్రమాద కేసులు నమోదవుతున్నాయి. పాలీ ట్రామా కేసుల చికిత్సకు భారీ వ్యయం అవుతుంది. సర్వజన ఆస్పత్రిలో లోడు పెరగడంతో చెయ్యలేకపోతున్నారు. ప్రైవేటు ఆస్పత్రులు ఒక్కోసారి సర్కారు నుంచి నిధులు రావడం లేదని చేతులెత్తేస్తున్నాయి. దీంతో రోజురోజుకూ సామాన్యుల్లో ఆందోళన పెరుగుతోంది.

**ఖరీదైన జబ్బులకు చిక్కే**



క్యాన్సర్, రోడ్డు ప్రమాదాలు, గుండె ఆపరేషన్లు లాంటి ఖరీదైన వైద్యం చేయించుకోవాలంటే పేదలకు చిక్కులు తప్పడం లేదు. ఆరోగ్యశ్రీ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయడం లేదు. ప్రైవేటు, కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద సేవలందించడం లేదు. ఇటీవల మా బంధువుల అబ్బాయి రోడ్డు ప్రమాదంలో గాయపడగా, ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించాం. ఆరోగ్యశ్రీ కింద చికిత్స చేసినప్పటికీ.. అదనపు ఖర్చుల కింద రూ.వేలల్లో డబ్బు వసూలు చేశారు.

– లీలావతి, టీటీపీ, గుమ్మఘట్ట మండలం

**కాన్పు జరిగితే గండం గడిచినట్టే**



ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏటా 55వేల వరకూ కాన్పులు (డెలివరీలు) జరుగుతున్నాయి. గడిచిన ఐదేళ్లు ఆరోగ్యశ్రీలో ఇబ్బంది లేకుండా నార్మల్, సిజేరియన్ డెలివరీలు జరిగాయి. ప్రస్తుతం పరిస్థితులు బాగోలేవు. ప్రైవేటు ఆస్పత్రులు నిధుల సమస్యతో కేసులు తీసుకోవడం లేదు. దీంతో నార్మల్ డెలివరీకి రూ.30 వేలు, సిజేరియన్‌కు రూ.50 వేలు చెల్లించుకోవాల్సి వస్తోంది.

## పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

- ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్'
- కలెక్టర్ టీఎస్ చేతన్



స్వచ్ఛ ఆంధ్ర దివస్ నిర్వహణపై సూచనలు, సలహాలిస్తున్న కలెక్టర్ చేతన్

**ప్రశాంతి నిలయం:** పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇచ్చి ప్రజారోగ్యంతో పాటు పర్యావరణం కాపాడాలని, ఇందుకు అన్ని శాఖలు సమష్టిగా పనిచేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్ పిలుపునిచ్చారు. అపరిశుభ్రతను రూపుమాపే లక్ష్యంతో ప్రతి నెలా మూడో శనివారం 'స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి సంబంధిత జిల్లా శాఖల అధిపతులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం అమలు, ముందస్తు ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు వైఎస్సార్ జిల్లా మైదుకూరులో 'స్వచ్ఛ ఆంధ్ర– స్వచ్ఛ దివస్' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పనిచేయాలన్నారు. ప్రతి నెలా ఒక్కో థీమ్‌తో ఏడాది పాటు క్రమం తప్పకుండా ప్రతి మూడో శనివారం కార్యక్రమం నిర్వహించాలన్నారు. పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్యాన్ని పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, పర్యాటకులు, యాత్రికులు, పెట్టుబడిదారులను మరింత ఆకర్షించే విధంగా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, భవిష్యత్ తరాలకు పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రజా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. కార్యక్రమ నిర్వహణలో పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలు కీలక పాత్ర పోషించాలన్నారు. సమావేశంలో జెడ్పీ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, డీపీఓ సమత, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ నరసయ్య, గ్రామ/వార్డు సచివాలయాల నోడల్ ఆఫీసర్ సుధాకర్ రెడ్డి, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ తిప్పేంద్ర నాయక్, కో ఆపరేటివ్ అధికారి కృష్ణానాయక్ తదితరులు పాల్గొన్నారు.

### రేపు ఏకసభ్య కమిషన్ రాక

**అనంతపురం అర్బన్:** ఎస్సీల్లో ఉపకులాల వర్గీకరణపై విచారణ నిర్వహించేందుకు ప్రభుత్వం నియమించిన రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఈ నెల 19న అనంతపురం విచ్చేయనుంది. ఆ రోజు సాయంత్రం ఆరు గంటలకు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బసచేస్తారు. ఎస్సీ వర్గీకరణ అంశంపై ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి 20వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు అధికారులతో సమావేశం, ఎస్సీ సంఘాలు, ప్రతినిధుల నుంచి వినతులు స్వీకరిస్తారు.

## మా సార్‌పైనే వార్తలు రాస్తారా!

- ఓ ఎస్‌ఐ అనుచరుడి వీరంగం

**చిలమత్తూరు:** ''మా ఎస్‌ఐ సార్‌పైనే వార్తలు రాస్తారా..? మీ అంతు చూస్తాం.. మేము పట్టా భూముల్లోని మట్టినే తోలుకున్నాం.. అది కూడా 250 టిప్పర్ల మట్టే తోలాం. మీ ఇష్టం వచ్చింది రాసుకోండి.. రూ. కోటి జరిమానా విధించినా కట్టేందుకు సిద్ధంగా ఉన్నాం.. కానీ టీడీపీ నేతలు మట్టిని టిప్పర్లతో రోడ్లకు వేసుకున్నారు... వారిపైనా వార్తలు రాయండి'' అంటూ రాప్తాడు నియోజకవర్గంలో పనిచేస్తూ స్థానికంగా కోళ్లఫాం ఏర్పాటు చేస్తున్న ఎస్‌ఐ అనుచరుడు సూర్యనారాయణ వీరంగ మాడారు. సదరు ఎస్‌ఐ స్థానికంగా కోళ్లఫాం ఏర్పాటు చేస్తూ అందుకు లేపాక్షి హబ్ భూముల్లోని మట్టిని అక్రమంగా తోలుకున్నారు. దీనిపై 'సాక్షి' వార్తలు రావడంతో సదరు ఎస్‌ఐ తన అనుచరుల ద్వారా బెదిరింపులకు దిగారు. ఈ క్రమంలోనే శుక్రవారం ఎస్‌ఐ అనుచరుడిగా చెప్పుకుంటున్న సూర్యనారాయణ సాక్షి విలేకరిని బెదిరించే ప్రయత్నం చేశారు. అయితే తాము మట్టి అక్రమంగా తోలుకున్న మాట వాస్తవమేనంటూ ఒప్పుకున్న అతను, అధికార పార్టీ నాయకులూ మట్టి దందా చేస్తున్నారని, వారిపైనా వార్తలు రాయాలని డిమాండ్ చేశారు. దీంతో అక్కడున్న వారే అతనికి బుద్ధి చెప్పి పంపారు.

## సబ్ రిజిస్ట్రార్‌పై సస్పెన్షన్ వేటు

**చిలమత్తూరు:** స్థానిక సబ్ రిజిస్ట్రార్ వెంకట నారాయణను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ విజయకుమారి ఉత్తర్వులు ఇచ్చారు. ఆయనతో పాటు సీనియర్ సహాయకుడు కుళ్లాయిస్వామిపైనా వేటు వేశారు. సబ్ రిజిస్ట్రార్ వెంకటనారాయణ నిబంధనలు పక్కన పెట్టి ఇష్టానుసారం భూములకు రిజిస్ట్రేషన్లు చేయడంతో కొందరు బాధితులు ఆధారాలతో సహా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ విచారణకు ఆదేశించడంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులు వెంకటనారాయణ వ్యవహారంపై ఆరా తీశారు. ఈ క్రమంలోనే గోరంట్ల మండలంలోని కొన్ని భూములు కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ వాటికి వెంకటనారాయణ రిజిస్ట్రేషన్ చేసినట్లు తేలింది. అలాగే ఫ్రీహోల్డ్ భూములను సంబంధం లేని లింక్ డాక్యుమెంట్లు జతపరిచి రిజిస్ట్రేషన్లు చేసినట్టుగా అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారాల్లో సబ్ రిజిస్ట్రార్ వెంకట నారాయణకు సీనియర్ అసిస్టెంట్ కుళ్లాయిస్వామి కూడా సహకరించినట్లు గుర్తించి ఇద్దరిపైనా వేటు వేసినట్లు తెలుస్తోంది. కాగా, వెంకట నారాయణ గతంలో బుక్కపట్నంలో పనిచేస్తున్న సమయంలోనూ నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్లు చేసి సస్పెండ్ అయ్యారు. తిరిగి విధుల్లో చేరినా పాత పంథా వదల్లేదు.

## 'ప్రచార' పనిమంతులు

**ధర్మవరంలో కూటమి నాయకుల పబ్లిసిటీ పిచ్చి**

- గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులకు పేటెంట్
- వైఎస్సార్ సీపీ హయాంలో వివిధ రోడ్ల నిర్మాణాలు
- ఇటీవల జాతికి అంకితం చేసిన ప్రధాని మోదీ
- క్రెడిట్ తమదేనంటూ కూటమి నేతల ప్రచారం
- విస్తుపోతున్న జనం



బత్తలపల్లి-ముదిగుబ్బ నాలుగు వరుసల జాతీయ రహదారి



ముదిగుబ్బ బైపాస్ రోడ్డు

**ధర్మవరం:** కూటమి నేతలు ప్రచార పనిమంతులుగా పేరుపొందుతున్నారు. 8 నెలల పాలనలో ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పనీ చేపట్టని నేతలు గత ప్రభుత్వ హయాంలో జరిగిన పనులను తమ ఖాతాలో వేసుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ఇటీవల ప్రధాని మోదీ జాతికి అంకితం చేసిన బత్తలపల్లి, ముదిగుబ్బ మండల కేంద్రాలలో బైపాస్ రోడ్డు పనులు, బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ వరకు నేషనల్ హైవే నాలుగు వరుసల రహదారి నిర్మాణ పనులు గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి కృషితో పూర్తి కాగా, వాటిని తామే చేసినట్లు కూటమి నాయకులు, బీజేపీ శ్రేణులు ప్రచారం చేసుకుంటూ జనం ముందు నవ్వులపాలవుతున్నారు.

**ధర్మవరంపై ప్రత్యేక శ్రద్ధ**

పట్టుచీరలతో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన ధర్మవరం అభివృద్ధిపై గత వైఎస్సార్ సీపీ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. మున్సిపాలిటి పరిధిలో 40 వార్డుల్లో రోడ్లు వేశారు. అలాగే దశలవారీగా శివారు ప్రాంతాలకు రహదారులను ఏర్పాటు చేశారు. ఇక నియోజకవర్గాన్ని ఇతర నగరాలతో కలిపేందుకు వీలుగా జాతీయ రహదారుల నిర్మాణాలకు పూనుకున్నారు. ఈ క్రమంలోనే ముదిగుబ్బ నుంచి ఎస్‌ఎస్‌పీ కొట్టాల వరకు బైపాస్ రోడ్డు నిర్మాణానికి సీఎం జగన్ ఆదేశాలతో అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్‌లు ఢిల్లీకి వెళ్లి కేంద్రం నుంచి నిధులు రాబట్టారు. 2023 జూన్ 10వ తేదీన అప్పటి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, అప్పటి ఎంపీ గోరంట్ల మాధవ్ బత్తలపల్లి-ముదిగుబ్బ జాతీయ రహదారి పనులకు, ముదిగుబ్బ బైపాస్ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. ఆ తర్వాత నాలుగు వరుసల రహదారితో పాటు చిత్రావతి లెవల్ క్రాసింగ్ బ్రిడ్జితో పాటు అనేక బ్రిడ్జిలను త్వరితగతిన పూర్తయ్యేలా కృషి చేశారు. అలానే ముదిగుబ్బ బైపాస్‌రోడ్డు పనులపై దృష్టి సారించి పూర్తి చేయించారు. ఈ పనులన్నీ సార్వత్రిక ఎన్నికలకు ముందే పూర్తయ్యాయి. సార్వత్రిక ఎన్నికలు రావడంతో ప్రారంభానికి నోచుకోలేదు.

**ఇటీవల జాతికి అంకితం చేసిన ప్రధాని**

నియోజకవర్గంలో పూర్తయిన రహదారులను ప్రధాని నరేంద్రమోడీ ఈనెల 8న జాతికి అంకితం చేశారు. దీంతో కూటమి నాయకులు, బీజేపీ శ్రేణులు సోషల్ మీడియాలో ఈ ఘనత తమ ప్రభుత్వానికి, తమ నాయకులకే దక్కుతుందని ప్రచారం చేశారు. దీన్ని చూసి ప్రజలు విస్తుపోతున్నారు. కనీసం ఒక్క రహదారి నిర్మాణం కూడా చేపట్టకుండా ఇలా గొప్పలు చెప్పుకోవడం సరికాదని పలువురు చర్చించుకుంటున్నారు.

**అన్నీ గతంలో చేసిన పనులే**



వైఎస్సార్ సీపీ హయాంలోనే బత్తలపల్లి నుంచి ముదిగుబ్బకు నాలుగు వరుసల రహదారి నిర్మాణం జరిగింది. ఈ రహదారి నిర్మాణం ద్వారా ట్రాఫిక్ సమస్య తీరడంతో పాటు అతితక్కువ సమయంలోనే గమ్యస్థానం చేరడం వీలవుతోంది. కానీ ఈ రహదారి పనులు తామే చేపట్టినట్లు బీజేపీ శ్రేణులు చెప్పుకోవడం దారుణం. కొత్త రహదారులను ఏర్పాటు చేసుకొని ప్రచారం చేసుకుంటే బాగుంటుంది.

–గుమ్మళ్లకుంట జయరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, బత్తలపల్లి

**ప్రచారం విడ్డూరం**



ముదిగుబ్బలో బైపాస్‌రోడ్డు కేతిరెడ్డి కృషితో సాకారమైంది. ఈ రహదారి కోసం మండల ప్రజలు ఎంతగానో వేచిచూశారు. ఈ రహదారి అందుబాటులో రావడంతో ట్రాఫిక్ సమస్య తీరింది. కేవలం కేతిరెడ్డి ముందు చూపుతోనే రహదారి నిర్మాణం సాకారమైంది. దాన్ని బీజేపీ శ్రేణులు, కూటమి నాయకులు వారి గొప్పలుగా చెప్పుకోవడం విడ్డూరం.

–సీవీ నారాయణరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, ముదిగుబ్బ

## క్లుప్తంగా

### రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి


గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం

పుట్టపర్తి అర్బన్: స్థానిక ప్రశాంతి – నారాయణపురం రైల్వే స్టేషన్ల మధ్య రైలు నుంచి జారిపడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. శుక్రవారం ఉదయం 9.30 గంటల సమయంలో రైల్వే ట్రాక్ పక్కన లోయలో మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న హిందూపురం రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ఎత్తు 5.5 అడుగులు, చామన ఛాయ రంగు, సిమెంటు కలర్ డ్రాయర్, క్రీమ్ కలర్ చినిగిన బనియన్‌తో ధరించి ఉన్నాడు. ఆచూకీ తెలిసిన వారు 94412 38182, 94406 27641కు సమాచారం అందించాలని రైల్వే పోలీసులు కోరారు.

### బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య


మంజునాథయాదవ్ (ఫైల్)

పెద్దపప్పూరు: క్షణికావేశంలో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు తెలిపిన మేరకు... పెద్దపప్పూరు మండలం చాగల్లు గ్రామానికి చెందిన గంగరాజు, ప్రమీల దంపతులకు ఇద్దరు కుమారులు కాగా, పెద్ద కుమారుడు నారాయణస్వామి ఇటీవల తన జేఎల్ఎం ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయంలో తండ్రికి చేదోడుగా నిలిచాడు. ఐచర్ వాహన డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్న రెండో కుమారుడు మంజునాథయాదవ్ (23) కొంత కాలంగా తనకు పల్సర్–160 బైక్ కొనివ్వాలని తండ్రిని అడుగుతూ వచ్చాడు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు బాగాలేవని, కొంత కాలం ఆగితే బైక్ కొనిస్తామని తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు. గురువారం మరోసారి బైక్ కొనుగోలు విషయంగా తల్లిదండ్రులను మంజునాథయాదవ్ ఒత్తిడి చేశాడు. వారు మరికొంత కాలం సమయం కావాలని తెలపడంతో క్షణికావేశానికి లోనైన మంజునాథయాదవ్ అదే రోజు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రాత్రి అయినా కొడుకు ఇంటికి రాకపోవడంతో తోటి మిత్రుల సాయంతో కుటుంబసభ్యులు గాలింపు చేపట్టారు. ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం తెల్లవారుజామున గంగరాజు తన మామిడి తోటకు నీళ్లు పెట్టడానికి వెళ్లిన సమయంలో అక్కడ మామిడి చెట్టుకు వేసుకున్న ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడు కనిపించాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు అక్కడకు చేరుకుని 'ఎంత పని చేశావయ్యా?' అంటూ బోరున విలపించారు. ఘటనపై ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

### వ్యక్తి దుర్మరణం


మృతుడు గంగరాజు

తలుపుల: ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.. కదిరి మండలం పట్నం గ్రామానికి చెందిన బి.గంగారాజు (50) తలుపుల మండలం ఓబులరెడ్డి గ్రామంలో ఉన్న తన మనవడిని చూసేందుకు వచ్చాడు. శుక్రవారం ద్విచక్ర వాహనంపై తిరుగు ప్రయాణమైన ఆయన తొగటవాండ్లపల్లి సమీపంలో వేగాన్ని నియంత్రించుకోలేక చెట్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ నరసింహుడు తెలిపారు.

# విస్తీర్ణం తక్కువ.. పంటలు ఎక్కువ

మనసుంటే మార్గం ఉంటుందని నాడు పెద్దలు అన్నారు. ఆశయం కోసం నిరంతరం కృషి చేసినప్పుడు అనుకున్నది సాకారమవుతుందని నిరూపించారు నేటి రైతులు. డబ్బు లేదని చింతించకుండా ఉన్న వనరులతో తక్కువ విస్తీర్ణంలో పంటల సాగు చేపట్టి పలువురికి ఆదర్శంగా నిలిచారు.

- సెంటు నుంచి ఐదు సెంట్ల స్థలంలో ఆకు, కూరగాయల సాగు
- ఇంటి ఆవరణ, ఖాళీ స్థలాల్లో కిచెన్ గార్డెన్స్
- స్వయం సహాయక, గ్రామ సంఘాల సమన్వయంతో ఏర్పాటు



ఎం.చెర్లోపల్లిలో పామాల్ల రామకృష్ణ పొలంలోని 5 సెంట్ల విస్తీర్ణంలో సాగు చేసిన కూరగాయలు, ఘన, ద్రవ జీవామృతాలను తయారు చేసుకుంటున్న రైతులు

రాప్తాడు: మండలంలో ప్రకృతి వ్యవసాయ అధికారులు ప్రయోగాత్మకంగా చేపట్టిన తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ పంటల సాగు విజయవంతమైంది. ఏడాది పొడవునా రాబడి ఉండేలా మల్టీ లేయర్ విధానంతో చేపట్టిన పంటల సాగు ఆశించిన ఫలితాలను ఇస్తుండడంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. రాప్తాడు మండలంలోని పలువురు రైతులు తమ పొలాలు, ఇంటి ఆవరణలో 365 కిచెన్ గార్డెన్స్ కాన్సెప్ట్, ఏటీఎం (వ్యవసాయ–పర్యావరణ పరివర్తన నమూనా)ను ఏర్పాటు చేసుకున్నారు. ఈ విధానం ద్వారా నాణ్యమైన ఆకుకూరలు, కూరగాయలను పండిస్తూ ప్రజారోగ్యానికి బాటలు వేస్తున్నారు.

**సెంటు నుంచి 5 సెంట్ల వరకూ..**

రాప్తాడు మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో దాదాపు 200 వరకు కిచెన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేశారు. ఏడాదిలో 365 రోజులూ ఆదాయం ఉండేలా వీటికి ప్రకృతి వ్యవసాయం విభాగం వారు రూపకల్పన చేయడంతో పాటు ఆ దిశగా రైతులను, గృహిణిలను ప్రోత్సహిస్తోంది. రైతుల పొలాల్లో ఓ సెంటు మొదలు ఐదు సెంట్ల వరకు, ఇంటి ఆవరణలు, మిద్దెపై వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరల పంటలపై విస్తృత చైతన్యం కల్పిస్తున్నారు. ఇందుకు సంబంధించిన విత్తనాలను ప్రకృతి వ్యవసాయ విభాగం వారే సమకూరుస్తున్నారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల సహకారంతో ఈ కార్యాచరణను విజయవంతంగా అమలు చేస్తున్నారు. దీంతో చాలా మంది తమ ఇళ్ల ఆవరణలో ఉన్న కొద్దిపాటి స్థలంలోనే కిచెన్ గార్డెన్‌ను అభివృద్ధి చేస్తున్నారు. అలాగే మిద్దెలపై టెర్రస్ గార్డెన్‌ను ఏర్పాటు చేసుకుంటున్నారు. సాగులో ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం సేంద్రీయ ఎరువులనే వాడుతుండడం విశేషం. పొలం గట్టు చివర ఉన్న మట్టిని లేదా, అటవీ ప్రాంతం నుంచి కానీ, పుట్ట మన్నును కాని సేకరించి టెర్రస్, కిచెన్ గార్డెన్‌కు వాడుతున్నారు.

### 5 సెంట్లలో ఐదారు రకాల పంటలు



నాకున్న పొలంలో నుంచి 5 సెంట్లలో బీట్‌రూట్, క్యారెట్, బెండ, మిరప, టమాట, ఆవాలు, కొత్తిమీర, ఆకుకూరలతో పాటు వివిధ రకాల కూరగాయలను పండిస్తున్నా. వీటికి ఎలాంటి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడడం లేదు. ప్రకృతి సేద్యం అధికారుల సూచన మేరకు పశువుల పేడ, జీవామృతం వాడుతున్నా. పంటల దిగుబడి ఎంతో నాణ్యతగా ఉంటున్నాయి. నెల పొడవునా ఇంటి అవసరాలు తీరడంతో పాటు ఇరుగు పొరుగు వారికి కూడా ఇస్తున్నాం.

– పామాల్ల రామకృష్ణ, రైతు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

### ఎంతో ఆరోగ్యంగా ఉన్నాం



మారిన మన ఆహారపు అలవాట్లే అనారోగ్యానికి కారణమని చాలా ఆలస్యంగా తెలుసుకున్నాం. దీంతో ప్రకృతి వ్యవసాయ అధికారుల సూచనతో ఇంటి వద్దనే ఖాళీగా ఉన్న 2 సెంట్లలో 15 రకాల కూరగాయలు, 10 రకాల ఆకు కూరలను సొంతంగా సాగు చేస్తున్నా. పెట్టుబడి తక్కువ. సేంద్రీయ ఎరువులు వాడుతున్నా. ఈ పంటను ఆహారంగా తీసుకున్న తర్వాత మా ఇంట్లో అందరమూ ఎంతో ఆరోగ్యంగా ఉన్నాం. పండించిన కూరగాయలు, ఆకు కూరలను మా ఇంటి అవసరాలకు వాడుకుని మిగిలిన వాటిని చుట్టుపక్కల వారికి ఇస్తున్నాం.

– రాజేశ్వరి, మహిళా రైతు, ఎం.చెర్లోపల్లి, రాప్తాడు మండలం

### పెరటి తోటలను ప్రోత్సహిస్తున్నాం



ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పెరటి తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నాం. పురుగు మందులు, రసాయనిక మందులు, ఎరువులు వాడకుండా కేవలం ద్రవ, ఘన జీవామృతాలనే వాడేలా అవగాహన కల్పిస్తున్నాం. రాప్తాడు మండలంలో ఇప్పటికే 200లకు పైగా కిచెన్ గార్డెన్స్‌ను ఏర్పాటు చేశాం. రైతులు కూడా ముందుకు వస్తున్నారు. వారికి అవగాహన కల్పిస్తూ విత్తనాలను సమకూరుస్తున్నాం.

– భూపాల్ రెడ్డి, ఎంటీఎల్, ప్రకృతి వ్యవసాయం, రాప్తాడు

## అరాచకాలు జాస్తి.. అభివృద్ధి నాస్తి

- ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిన కూటమి సర్కార్
- సూపర్ సిక్స్ హామీల అమలు ఎప్పుడో చెప్పాలి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్

పరిగి: కూటమి సర్కార్ పాలనలో అభివృద్ధి అటకెక్కిందని, అరాచకాలకు మాత్రం అంతేలేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మండిపడ్డారు. శుక్రవారం ఆమె, పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చాల్సిన సీఎం చంద్రబాబు... దాన్ని విస్మరించి డైవర్షన్ పాలిటిక్స్‌తో కాలం గడుపుతున్నారన్నారు. కూటమి పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు రాష్ట్రాన్ని దోచుకోవడంపైనే దృష్టి సారించారని, దీంతో ప్రజల ఆకాంక్షలు గంగలో కలిశాయన్నారు. అందువల్లే జనమంతా ఇప్పుడు గత వైఎస్సార్ సీపీ పాలనను తలచుకుంటున్నారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చారిత్రాత్మక సంక్షేమాన్ని అందించి ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్నారన్నారు. నేడు కూటమి సర్కార్‌కు సంక్షేమాన్ని పూర్తిగా తుంగలో తొక్కిందన్నారు. ప్రజల కష్టాలు, కన్నీళ్లు తుడవాల్సిన కూటమి నేతలు... కేవలం వైఎస్సార్ సీపీ నాయకులను విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. 'సూపర్ సిక్స్' పేరుతో అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

**బీసీలకు పింఛన్లు ఎప్పుడిస్తారో మంత్రి చెప్పాలి**

తాము అధికారంలోకి వస్తే 50 ఏళ్లు నిండిన బీసీలందరికీ పింఛన్లు ఇస్తామని ఎన్నికల సమయంలో సవిత చెప్పారని, ఇప్పుడు బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ఆమె.. బీసీలకు ఎప్పుడు పింఛన్లు ఇస్తారో చెప్పాలన్నారు. ప్రజా సంక్షేమాన్ని, బీసీల అభ్యున్నతిని పక్కన పెట్టిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ల్యాండ్ కబ్జాలు చేస్తూ దోచుకోవడమే పనిగా పెట్టుకున్నారన్నారని ఉషశ్రీ మండిపడ్డారు. ఇందుకు పోలీసు యంత్రాంగాన్ని కూడా ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కూటమి నేతలు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకూ వైఎస్సార్ సీపీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టి తీరుతామన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజా కోర్టులోనే బుద్ధి చెబుతామన్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించినా, అక్రమ కేసులు పెట్టినా ఊరుకోబోమన్నారు. చట్టపరంగా న్యాయ పోరాటాలు చేసి, పార్టీ కార్యకర్తలను రక్షించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, పలువురు పార్టీ నేతలు పాల్గొన్నారు.

## జైలు శిక్ష నిబంధన బాలయ్యకు వర్తించదా?

- 'పురం' వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక


మాట్లాడుతున్న టీఎన్ దీపిక

హిందూపురం: బెల్టుషాపులు నిర్వహిస్తే రూ.5 లక్షల జరిమానాతో పాటు జైలు శిక్ష ఉంటుందని గతంలో సాక్షాత్తూ సీఎం చంద్రబాబు హెచ్చరికలు జారీ చేశారని, అయితే ఈ నిబంధన బాలయ్య విషయంలో వర్తింపు చేయడంలో కూటమి సర్కార్ ఘోరంగా విఫలమైందని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. నియోజకవర్గంలో అడ్డూఅదుపు లేకుండా అనధికార మద్యం విక్రయాలు, ఇతర రాష్ట్రాల కల్తీ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కురుబ విభాగ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.ఎ.శివతో కలసి శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత హిందూపురం ప్రాంతంలో ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల కనుసన్నల్లో మద్యం సిండికేట్ రెచ్చిపోయిందన్నారు. బెల్ట్‌షాపులు ఎక్కడపడితే అక్కడ తెరిచి అధికారపార్టీ నాయకులే అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు. చిలమత్తూరులో ఓ దుకాణానికి లైసెన్స్ పొంది కొడికొండ చెక్ పోస్టులోనూ అనధికారికంగా నిర్వహిస్తున్నారన్నారు. తూమకుంట వద్ద ఓ షాపునకు అనుమతి పొంది కిరికెర మిల్లు వద్ద మరో దుకాణం ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ ఆదేశాలను టీడీపీ నేతలే తుంగలో తొక్కి గోవా, ఇతర రాష్ట్రాల నుంచి చీప్ లిక్కర్‌ను యథేచ్ఛగా దిగుమతి చేసుకుని అక్రమ వ్యాపారం సాగిస్తున్నారన్నారు. చివరకు డిఫెన్స్ లిక్కర్‌ను కూడా కల్తీ చేసి అమ్ముతున్నారన్నారు. ప్రతి బాటిల్‌పై రూ.20 నుంచి రూ.30 వరకు అధిక ధరతో విక్రయాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. నియోజకవర్గ ప్రజల సంక్షేమాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ గాలికి వదిలేశారన్నారు. మద్యం, కల్లు విక్రయాల ద్వారా నెలకు రూ.లక్షలు వసూలు చేసి హైదారాబాద్‌కు పంపుతున్న ఎమ్మెల్యే పీఏలు బాహాటంగానే పేర్కొంటున్నారన్నారు. అక్రమాలు, దౌర్జన్యాలకు వారు పాల్పడుతూ.. వైఎస్సార్‌సీపీకి చెందిన వారిపై అన్యాయంగా కేసులు బనాయిస్తున్నారని మండిపడ్డారు. ఇకపై ఇలాంటి దౌర్జన్యాలు, అక్రమ కేసుల బనాయింపులు మానుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, పార్టీ వివిధ విభాగాల అధ్యక్షులు నాగమణి, మార్కెట్ చాంద్, మహేష్, తిప్పరుద్రయ్య, గిరి, కౌన్సిలర్లు, మండల కన్వీనర్లు రాము, నిస్సార్, శ్రీరామరెడ్డి పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న నృత్యరూపకం

ప్రశాంతి నిలయం: పర్తియాత్రలో భాగంగా పుట్టపర్తికి విచ్చేసిన సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన జోన్–3 సత్యసాయి యువత శుక్రవారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. 'కలియుగ అవతార సాయి భగవాన్' పేరుతో నిర్వహించిన సంగీత నృత్యరూపకం అలరించింది. అనంతరం మహాసమాధిని దర్శించుకున్నారు.


నృత్యరూపకంలో పాల్గొన్న కళాకారులు

### కుక్కల దాడిలో 44 గొర్రె పిల్లలు మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలను చూపుతున్న బాధితులు

చెన్నేకొత్తపల్లి: వీధి కుక్కల దాడిలో ఏకంగా 44 గొర్రె పిల్లలు మృతి చెందాయి. చెన్నేకొత్తపల్లి మండలం హరియాన్‌చెరువులో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. జీవాల పోషణతో జీవనం సాగిస్తున్న హరియాన్‌చెరువుకు చెందిన కిష్టప్ప, చిట్రా చిరంజీవి, మల్లికార్జున శుక్రవారం ఉదయం గొర్రె పిల్లలను వేరు చేసి కంచెలో వదిలారు. మిగిలిన జీవాలను మేపునకు తోలుకెళ్లారు. సాయంత్రం తిరిగి వచ్చే సమయానికి 44 గొర్రె పిల్లలు మృతి చెంది కనిపించాయి. ఇందులో కిష్టప్పకు చెందిన 22, చిట్రా చిరంజీవికి చెందిన 17, మల్లికార్జునకు చెందిన 5 గొర్రె పిల్లలు ఉన్నాయి. కుక్కలు దాడి చేసినట్లుగా గుర్తించారు. ఘటనతో దాదాపు రూ.1.50 లక్షలు నష్టపోయినట్లు బాధిత కాపరులు వాపోయారు.

### చోరీ కేసులో నిందితుల అరెస్ట్


నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

హిందూపురం అర్బన్: మండలంలోని గోళ్లాపురం పారిశ్రామిక వాడలో నాలుగు రోజుల క్రితం కిరాణా దుకాణంలో చోరీకి పాల్పడిన ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలను సీఐ ఆంజనేయులు వెల్లడించారు. ఇస్లాంపురం గ్రామానికి చెందిన సయ్యద్ సమీర్, అబాద్ పేటకు చెందిన అంకిత్, అదే ప్రాంతానికి చెందిన మహమ్మద్, ఆసీఫ్ చెడు అలవాట్లకు బానిసలై తమ జల్సాలు తీర్చుకునేందుకు హిందూపురం చుట్టుపక్కల చిల్లర దొంగతనాలకు పాల్పడేవారు. ఈ క్రమంలో గత సోమవారం రాత్రి గోళ్లాపురం పారిశ్రామిక వాడలోని కిరాణా దుకాణంలో చొరబడి 41 బియ్యం ప్యాకెట్లు, 10 కిలోల జీడిపప్పు, రెండు త్రాసులు అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం హిందూపురం శివారులో వాహన తనిఖీలు చేపట్టిన సమయంలో అటుగా వచ్చిన వ్యాన్‌ను ఆపి పరిశీలించారు. అందులో 41 బియ్యం ప్యాకెట్లు, 10 కిలోల జీడిపప్పు, రెండు త్రాసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. సరుకు రవాణా చేస్తున్న సమీర్, అంకిత్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

### ఇంక్రిమెంట్లలో కోత తప్పదు : కలెక్టర్

ప్రశాంతి నిలయం: నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోని సర్వేయర్లకు ఇంక్రిమెంట్లలో కోత విధించాలని ల్యాండ్ సర్వే విభాగం ఉన్నతాధికారులను కలెక్టర్ చేతన్ ఆదేశించారు. రీ సర్వే, రెవెన్యూ సదస్సులలో అందిన వినతులపై సర్వేయర్లతో శుక్రవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో మండలాల వారీగా కలెక్టర్ సమీక్షించారు. మండలాల వారీగా లక్ష్యాలను నిర్దేశించుకుని రీ సర్వే వినతుల పరిష్కారం వేగవంతం చేయాలన్నారు. ఈ ప్రక్రియను ఆర్డీఓలు రోజూ సమీక్షించాలన్నారు. జిల్లాలో సర్వేయర్ల పనితీరు సక్రమంగా లేదని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్ఓ విజయసారథి, పుట్టపర్తి, పెనుకొండ, కదిరి, ధర్మవరం ఆర్డీఓలు సువర్ణ, ఆనంద్, శర్మ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## 'పురం' న్యాయ స్థానాల భవనాల మార్పు

- పశుసంవర్ధక వైద్యశాల భవనంలోకి కోర్టులు
- ఈ నెల 20 నుంచి అక్కడి నుంచే కార్యకలాపాలు
- నూతన భవనాల్లో సర్వమత ప్రార్థనలు
- పాల్గొన్న న్యాయమూర్తులు, న్యాయవాదులు


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న న్యాయమూర్తులు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి, ప్రత్యేక మెజిస్ట్రేట్, సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయ స్థానాల కార్యకలాపాలు ఈ నెల 20వ తేదీ నుంచి స్థానిక పశుసంవర్థక వైద్యశాల భవన సముదాయం నుంచి కొనసాగనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఆయా న్యాయ స్థానాలు కొనసాగుతున్న భవన సముదాయాలు శిథిలావస్థకు చేరడంతో హైకోర్టు ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. శుక్రవారం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ నేతృత్వంలో నూతన భవన సముదాయాల్లోని ఆయా కోర్టుల్లో సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మానిపాటి శ్రీధర్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, జూనియర్ సివిల్ జడ్జి లలితాలక్ష్మి సర్వమత ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు జిల్లా జడ్జి శైలజ మాట్లాడుతూ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థానాలు పశువర్ధక శాఖ రెండో అంతస్తులో, ప్రత్యేక న్యాయమూర్తి, రెండో తరగతి న్యాయస్థానాలు మూడో అంతస్తు నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తాయన్నారు. ఆయా కోర్టుల్లో కేసులు ఉన్న కక్షిదారులు ఈ నెల 20వ తేదీ నుంచి నూతన సముదాయాల్లో హాజరు కావాలన్నారు. అనంతరం బార్ అసోసియేషన్‌లో న్యాయమూర్తులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఏపీపీ ఇందాద్, నగేష్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వన్నెరప్ప, ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ సిద్ధూ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజశేఖర్, సీనియర్ న్యాయవాదులు రామచంద్రారెడ్డి, సుదర్శన్, నాగరాజురెడ్డి, నాగేంద్ర, సత్యనారాయణ, మురళి, ఉదయ్ సింహారెడ్డి, పీవీ శ్రీనివాసరెడ్డి, అబ్దుల్లా, రకీబ్, రవి, చంద్రలతో పాటు ఆయా కోర్టుల ఉద్యోగులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత బియ్యం అక్రమ దందా

- 407 వాహనంలో బియ్యం తరలిస్తూ పట్టుబడ్డ మధుబాబు
- 5 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం, వాహనం సీజ్

ధర్మవరం: రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి అక్రమంగా కర్ణాటకకు తరలిస్తున్న వాహనాన్ని పట్టణ పోలీసులు సీజ్ చేశారు. శుక్రవారం రాత్రి పట్టణంలోని చిన్నూరు రోడ్డులో 407 వాహనంలో టీడీపీ నేత మధుబాబు బస్తాలను నింపుతుండగా సమాచారం అందుకున్న పట్టణ సీఐ నాగేంద్ర ప్రసాద్ అక్కడకు చేరుకుని 5 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మధుబాబుతో పాటు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి వాహనాన్ని సీజ్ చేశారు. కాగా, మధుబాబు అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఉమ్మడి అనంతపురం జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రేషన్ బియ్యాన్ని అక్రమంగా సేకరించి కర్ణాటకకు తరలించి అధిక ధరలకు విక్రయిస్తున్నట్లుగా సమాచారం. అంతేకాక ఎఫ్‌సీ గోదాము అధికారులను సైతం ప్రలోభాలకు గురి చేసి నేరుగా గోడౌన్ నుంచే వాహనాలలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించుకునేవాడనే ఆరోపణలూ ఉన్నాయి.

## అ'పూర్వ' కలయిక

బత్తలపల్లి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 1999–2000 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న వారు శుక్రవారం బత్తలపల్లిలోని ఓ కల్యాణమంటపంలో కలుసుకున్నారు. నాడు మొత్తం 120 మంది కలసి చదువుకోగా వీరిలో 100 మంది హాజరు కావడం విశేషం. ఉన్నత విద్యాభ్యాసం తర్వాత వివిధ ప్రాంతాల్లో కుటుంబసభ్యులతో కలసి స్థిరపడిన వారందరూ సంక్రాంతి సందర్భంగా సొంతూళ్లకు వచ్చారు. ఈ క్రమంలో శుక్రవారం అపూర్వ సమ్మేళనం పేరుతో ఒక్కటయ్యారు. సాయంత్రం వరకూ ఆటపాటలతో సందడి చేశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. చిన్ననాటి అల్లర్లను తలుచుకుని మురిసిపోయారు. కార్యక్రమానికి నారాయణస్వామి, రవికుమార్, చిరంజీవి, రాగి నారాయణస్వామి, రంగానాయుడు, రాము, కాకి సురేష్, పెద్దిరెడ్డి, సురేష్, వేణు, బాబావలి తదితరులు నేతృత్వం వహించారు.


ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు